క్లుప్తంగా

సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలి



మాట్లాడుతున్న రైతు సంఘ జిల్లా నేతలు

ముత్తుకూరు : ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు షేక్ షాన్‌వాజ్, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ షేక్ మున్నా డిమాండ్ చేశారు. ముత్తుకూరులోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం 2.65 లక్షల మంది వలంటీర్లను నియమించిందని, ఉద్యోగ భద్రత కల్పిస్తామంటూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వీరిని వీధిన పడేసిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వెంటనే వీరిని విధుల్లోకి తీసుకోవాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలన్నారు. కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను అవమానించడం అమానవీయమన్నారు. కార్యక్రమంలో సీపీఐ సర్వేపల్లి కార్యదర్శి కొమారి సందయ్య, మండల కార్యదర్శి తుంగా ఏడుకొండలు, ఏవైఎఫ్ఐ కన్వీనర్ షేక్ అన్వర్, ముజీబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బాలచిత్ర కళాశ్రీ అవార్డులు



అవార్డులతో విద్యార్థులు

పొదలకూరు : నెల్లూరు అమీర్ ఆర్ట్స్ అకాడమీ వారు ఇటీవల నిర్వహించిన తొమ్మిదో జాతీయ స్థాయి బాలల చిత్రకళా పోటీల్లో నాగార్జున స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎనిమిది మంది బాలచిత్ర కళాశ్రీ అవార్డుకు ఎంపికయ్యారు. నెల్లూరు టౌన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో చిత్రకారులు అమీర్, షేక్ అబ్దుల్లా చేతుల మీదుగా విద్యార్థులు గోల్డ్ మెడల్, ప్రశంసాపత్రాలను ఆదివారం అందుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల అడ్వైజర్ ఎ.సుబ్బారావు, వైస్ ప్రిన్సిపల్ పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

అమరావతి విద్యార్థులకు..

పట్టణంలోని అమరావతి స్కూల్ విద్యార్థులు 30 మందికి అమీర్ ఆర్ట్స్ అకాడమీ వారు గోల్డ్ మెడల్, ప్రశంసాపత్రాలను అందజేసినట్టు కరస్పాండెంట్ కె.సురేష్ వెల్లడించారు.

ఎస్సీ హాస్టల్ తీరుపై డీడీ ఆగ్రహం



అధ్వానంగా ఉన్న హాస్టల్‌ను పరిశీలిస్తున్న డీడీ

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌ను సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మౌలిక వసతులు సరిగ్గా లేకపోవడంతో వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వంట గది వద్ద దుర్వాసన, తాగునీటి పైప్‌లైన్ నిర్వహణపై అసహనం వ్యక్తం చేశారు. కనీసం హాస్టల్‌ను శుభ్రంగా ఉంచుకోరా.. అన్ని ప్రశ్నించారు. సాయంత్రంలోగా మొత్తం క్లీన్ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు భయం లేకుండా పరీక్షలు రాసేందుకు మోటివేషన్ క్లాసులను ఏర్పాటు చేస్తామన్నారు. హాస్టల్ మరమ్మతులకు ఇప్పటికే రూ.22 లక్షలు మంజూరైందని, త్వరలో పనులను ప్రారంభిస్తామన్నారు.

వ్యక్తిపై హత్యాయత్నం

ఇందుకూరుపేట : మండలంలోని ఇందుకూరుపేటలో ఓ యువకుడిపై ముగ్గురు వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఎస్సై నాగార్జునరెడ్డి ఆదివారం తెలిపిన సమాచారం మేరకు.. ఇందుకూరుపేటకు చెందిన వంశీ ఐదు రోజుల క్రితం స్నేహితుల వద్ద కొరుటూరుకు చెందిన తుమ్మల జశ్వంత్‌ను డాన్ అని పిలుస్తూ ఆరాతీశారు. ఈ విషయం జశ్వంత్‌కు తెలియడంతో నెల్లూరుకు చెందిన యుగంధర్, సాయితేజతో కలిసి ఇందుకూరుపేటలో వంశీని కలిసి వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో కత్తితో వంశీపై దాడి చేశాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. క్షతగాత్రుడిని వైద్యశాలకు తరలించారు. సీఐ సుధాకర్‌రెడ్డి ఆదివారం ఇందుకూరుపేటకు వచ్చి ఘటనపై ఆరాతీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై నాగార్జునరెడ్డి వివరించారు.

కనిపించిందా జాగా..

వేసేయ్ పాగా

- యథేచ్ఛగా ప్రభుత్వ స్థలాల కబ్జా
- పెన్నా పరీవాహక ప్రాంతాన్నీ వదలడంలేదు
- భగత్‌సింగ్‌కాలనీలో జోరుగా అక్రమ నిర్మాణాలు
- అధికార పార్టీ నేతల కనుసన్నల్లో..
- పట్టించుకోని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు



ఆక్రమించిన ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు



కబ్జాకు గురైన పెన్నా పరీవాహక ప్రాంతం

సాక్షి టాస్క్‌ఫోర్స్, నెల్లూరు: నగరంలోని 54వ డివిజన్ పరిధిలో గల భగత్‌సింగ్‌కాలనీలో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. అక్రమ నిర్మాణాలను యథేచ్ఛగా సాగిస్తున్నారు. ఆపై వీటిని అమాయకులకు విక్రయించడం .. అద్దెకు ఇస్తూ అక్రమార్కులు భారీగా గడిస్తున్నారు. వీరికి రాజకీయ పలుకుబడి ఉండటంతో ప్రశించే సాహసాన్ని స్థానికులు చేయలేకపోతున్నారు.

మేము పట్టించుకోం..!

భగత్‌సింగ్‌కాలనీలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ.. పెన్నా పోరంబోకు స్థలాలు అన్యాక్రాంతమవుతున్నా, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడంలేదు. పెన్నా పక్కన ఉన్న భూములను సైతం ఆక్రమించి సాగు చేస్తున్నారు. అధికార పార్టీ అండదండలతో స్థానిక నేతలు ఈ పర్వానికి తెరలేపారు. ప్రభుత్వ, పెన్నా పరీవాహక ప్రాంతాల్లో ఆక్రమణకు గురైన స్థలంలో హెచ్చరిక బోర్డులను అధికారులు గతంలో ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం వీటిని ఎవరూ లెక్కచేయకుండా తమ పనిని కానిచ్చేస్తున్నారు. ఆక్రమణలకు పాల్పడే వారు ఎంతటివారైనా ఉపేక్షించేదిలేదని మంత్రి నారాయణ తరచూ చెప్తున్నా, అది మాటలకే పరిమితమవుతోందే తప్ప ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి దీనిపై చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

యాదవ విద్యార్థుల సంక్షేమానికి కృషి



యాదవ ఎంప్లాయీస్ సొసైటీ నూతన కార్యవర్గం

నెల్లూరు(అర్బన్): యాదవ విద్యార్థుల సంక్షేమానికి.. యాదవ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తామని యాదవ ఎంప్లాయీస్ సొసైటీ వ్యవస్థాపకుడు గోతం శ్రీనివాసులు పేర్కొన్నారు. నగరంలోని సొసైటీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సంస్థ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు, ఉద్యోగుల కోసం అధునాతన భవనాన్ని కొత్తూరు సమీపంలో నిర్మించామని చెప్పారు. ఈ ఏడాది పది మంది పేద యాదవ విద్యార్థులకు ఉచిత హాస్టల్ వసతిని కల్పిస్తున్నామని వివరించారు. పనుల నిమిత్తం ఇతర ప్రాంతాల నుంచి వచ్చే యాదవ ఉద్యోగులకు ఉచితంగా వసతి కల్పించేలా నిర్ణయం తీసుకున్నామన్నారు.

నూతన కార్యవర్గ ఎన్నిక

ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా డబ్బుగొట్లు వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ప్రేమ్‌కుమార్, దాసరి యుగంధర్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా చెంచలబాబు, శేషాద్రి, జనార్దన్, ఉపాధ్యక్షులుగా ప్రభాకర్, ప్రసాద్, నరేష్, జిల్లా కార్యదర్శులుగా గోపాల్, మధుసూదన్‌రావు, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా రమేష్, కామాక్షయ్య తదితర 25 మందితో నూతన కమిటీని ఏర్పాటు చేశారు.

హైందవ శంఖారావానికి తరలిరండి



మాట్లాడుతున్న శేషు

నెల్లూరు(అర్బన్): విజయవాడలో వచ్చే నెల ఐదున వీహెచ్‌పీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న హైందవ శంఖారావ బహిరంగ సభకు జిల్లా నుంచి డాక్టర్లు భారీగా తరలిరావాలని ఆరెస్సెస్ ప్రముఖ్ పుట్టా శేషు పిలుపునిచ్చారు. నగరంలోని అభిరామ్ హోటల్లో డాక్టర్లతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవాలయాలను స్వయం ప్రతిపత్తి చేయాలని.. జాతీయ ధార్మిక మండలిని ఏర్పాటు చేయాలనే డిమాండ్లతో సభను నిర్వహించనున్నామని తెలిపారు. ఆరెస్సెస్ నగర సంఘ్‌చాలక్ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ సీవీ సుబ్రహ్మణ్యం, సంఘ్ చాలక్ రామదానందు, బీజేపీ నేత రఘునాథ్‌రాజు, జయభారత్ హాస్పిటల్ జనరల్ మేనేజర్ గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి



రక్తదాన శిబిర నిర్వాహకులకు సత్కారం

నెల్లూరు(అర్బన్): ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడేందుకు గానూ ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ కన్వీనర్ అజయ్‌బాబు పేర్కొన్నారు. మద్రాస్ బస్టాండ్ సమీపంలోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని సినీ నటుడు ధన్‌రాజ్ ఫౌండేషన్ మోటివేటర్లు సాబీర్, షఫీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. అనంతరం రక్తదాన శిబిర నిర్వాహకులకు సర్టిఫికెట్లను అందజేసి సత్కరించారు. రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు మలిరెడ్డి కోటారెడ్డి, జనరిక్ మెడికల్ షాపు కన్వీనర్ మురళీకృష్ణ, రక్తదాన మోటివేటర్లు భాస్కర్‌రావు, సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభల జయప్రదానికి పిలుపు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

నెల్లూరు (టౌన్): కాకినాడలో జనవరి ఐదు నుంచి నిర్వహించనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవకోటేశ్వరరావు పిలుపునిచ్చారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ప్రచార జాతను సోమవారం నిర్వహించనున్నామని చెప్పారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి శేషు, చలపతి, ఖాజావలీ, వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓపై దాడి తగదు



మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

నెల్లూరు(అర్బన్): అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీఓ జవహర్‌బాబుపై దాడి సరికాదని ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని సంఘ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు చేపట్టాలని కోరారు. ఏపీజీఈఏ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, సిటీ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, సచివాలయ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు బషీర్, ఇందుకూరుపేట, కోవూరు తాలుకా అధ్యక్షులు నారాయణరెడ్డి, దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన నీటి సరఫరాకు పర్యవేక్షించాలి



తాగునీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలిస్తున్న సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): నగరంలో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్‌ల ద్వారా అందిస్తున్న తాగునీరు స్వచ్ఛంగా ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. సంగం మండలంలోని మహ్మదాపురంలో గల తాగునీటి శుద్ధి కేంద్రాన్ని అధికారులతో కలిసి ఆదివారం ఆయన పరిశీలించారు. పెన్నా నుంచి నీటిని సేకరిస్తున్న కేంద్రంలోని 122 ఎమ్మెల్డీ సామర్థ్యం గల ఇన్‌టేక్ వెల్‌ను పరిశీలించి వివిధ అంశాలను ఆరాతీశారు. తాగునీటి శుద్ధత ప్రమాణాలను వంద శాతం పాటించాలని, నగరానికి మంచినీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు.

సేవ చేయడాన్ని విధిగా భావించాలి



పేదలకు వస్త్రాల పంపిణీ

నెల్లూరు(బారకాసు): సేవ చేయడాన్ని ప్రతి ఒక్కరూ విధిగా భావించాలని ప్రముఖ న్యాయవాది పొన్నవోలు మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఏబీఎం కాంపౌండ్‌లో క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. పేదలకు అన్ని రకాల సహాయ సహకారాలను అసోసియేషన్ నిర్వాహకుడు ప్రేమ్‌కుమార్ అందిస్తున్నారని కొనియాడారు. అనంతరం పలువురికి వస్త్రాలను పంపిణీ చేసి అన్నదానాన్ని నిర్వహించారు. కవిత, ప్రసాద్‌రెడ్డి, జయప్రకాష్, సిస్టర్ సరోజ, ఫాదర్ అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంధ మహోత్సవం



నెల్లూరు(బారకాసు): చిన్నబజార్‌లోని నెల్లూరు పెద్ద దర్గా ఖాజాపీర్ బంధానవాజ్ గంధ మహోత్సవాన్ని వేడుకగా ఆదివారం నిర్వహించారు. తొలుత ఖాజాపీర్ మకాన్ ఆసార్ ఘర్ నుంచి రాత్రి బయల్దేరి దర్గాకు తెల్లవారుజామున చేరుకుంది. షెహన్‌షా దర్గా సమాధికి గంధ లేపనం చేశారు. పీఠాధిపతి బాబాసాహెబ్ బంధానవాజ్, తమిళనాడు పీఠాధిపతి మొహ్మద్ సాహెబ్, రఫాత్ హుస్సేనీ, యూసఫ్ హుస్సేనీ, సర్ఫరాజ్ హుస్సేనీ, ఫయాజ్ రజ్వీ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలపై చర్యలకు వినతి

నెల్లూరు (టౌన్): రానున్న విద్యాసంవత్సరానికి సంబంధించి ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలపై చర్యలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేంద్ర ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పదో తరగతి పరీక్షలకు ముందే అడ్మిషన్ల కోసం విద్యార్థుల ఇళ్ల చుట్టూ తిరుగుతున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై జిల్లా అధికారులు దృష్టి సారించాలని కోరారు.

అగ్నికుల క్షత్రియుల అభివృద్ధికి సహకరించాలి



నెల్లూరు(బారకాసు): అగ్నికుల క్షత్రియుల అభివృద్ధికి కుల పెద్దలు ఐకమత్యంగా ఉంటూ సహకరించాలని నేతలు గిరి, చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. నవాబుపేటలోని ధర్మరాజస్వామి దేవస్థాన ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన అగ్నికుల క్షత్రియుల సమావేశంలో వారు మాట్లాడారు. కుల సంఘ నేతలమని చెప్పుకొంటూ లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదని హితవు పలికారు. శిథిలావస్థకు చేరుకున్న అగ్నికుల క్షత్రియుల ఆలయాన్ని పునర్నిర్మించి దేవస్థాన అభివృద్ధికి ఎంతో కృషి చేశామని చెప్పారు. అందరూ కలిసి చర్చించుకొని సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. సాదా నాగయ్య, మిట్టా ధనుంజయ్, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, బాబు, మురళి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(బారకాసు): మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పొదలకూరు రోడ్డులోని పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. వివిధ అంశాలపై వీరు చర్చించారు.

ధర్మాచార్య దర్శన యాత్ర పోస్టర్ల ఆవిష్కరణ



నెల్లూరు(బారకాసు): నగరంలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో ధర్మాచార్య దర్శన యాత్ర ఉద్ఘాటన కార్యక్రమాన్ని బ్రాహ్మణ విరాట్ పరివార్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన సమన్వయకర్త మల్లవరపు లక్ష్మీనరసింహారావు మాట్లాడారు. బ్రాహ్మణులను ఏకతాటిపైకి తీసుకొచ్చి.. వారి సంపూర్ణ సమన్వయంతో ధర్మాచార్య దర్శన యాత్రను ప్రారంభించనున్నామని వివరించారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఇందుకూరుపేట లలితా ఆశ్రమ పీఠాధిపతి రామాయణం మహేష్‌స్వామి, డాక్టర్ పెళ్లూరు శివకార్తీక్, డాక్టర్ సీవీ సుబ్రహ్మణ్యం, బ్రాహ్మణ పరివార్ సమన్వయకర్తలు డాక్టర్ సూరిబాబు చక్రధర్, పారా శ్రీధర్‌శర్మ, సురభి ఉమాదేవి, జయలక్ష్మి, కేశవ, కామేశ్వరప్రసాద్, చక్రాల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



నెల్లూరు(బారకాసు): మొక్కలతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, వీటిని నాటడం మంచి సంప్రదాయమని జెడ్పీ వాకర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. పొదలకూరు రోడ్డులోని జెడ్పీ స్కూల్ ఆవరణలో జెడ్పీ వాకర్స్ సంఘానికి చెందిన 25 మంది సభ్యుల పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకొని మొక్కలను ఆదివారం నాటారు. అనంతరం ఆరు, ఏడో తరగతి విద్యార్థులకు వాలీబాల్‌ను సభ్యులు కోటేశ్వరరావు, అన్నపూర్ణమ్మ అందజేశారు. వరల్డ్ సూపర్ టాలెంటెడ్ కిడ్‌గా అవార్డులను అందుకున్న ప్రీషాను సత్కరించారు. నారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డి, చెంచయ్య, రాణెమ్మ, హరిసుధ, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

వేదగిరిలో విశేష పూజలు



పూజలకు హాజరైన కమిషనర్, కుటుంబసభ్యులు

నెల్లూరు సిటీ: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో విశేష పూజలను ఆదివారం నిర్వహించారు. కమిషనర్ సూర్యతేజ కుటుంబసమేతంగా విచ్చేసి స్వామి, అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు, అధికారులు వారికి స్వాగతం పలికారు. అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు.

వాకర్స్ అసోసియేషన్‌కు అవార్డులు



నెల్లూరు(బారకాసు): ఏలూరులో నిర్వహించిన వాకర్స్ ఇంటర్నేషనల్ వార్షికోత్సవంలో ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్‌కు ఎక్సలెంట్ అవార్డు, బెస్ట్ మెడికల్ క్యాంపు, సర్టిఫికేట్ అవార్డులు లభించాయి. దీన్ని అసోసియేషన్ సభ్యులకు ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ మురళీమోహన్‌రావు అందజేశారు. డిప్యూటీ గవర్నర్ కనకట్ల రఘురామ్ ముదిరాజ్, అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి అనంతరామారావు, మాజీ అధ్యక్షుడు వేలూరు రంగారావు, వైస్ ప్రెసిడెంట్ తలారి బాలసుధాకర్, గవర్నర్ పలగాటి శ్రీనివాసులురెడ్డి, నలుబోలు బలరామయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రంగవల్లుల పోటీలు



విజేతలకు బహుమతుల ప్రదానం

నెల్లూరు(బారకాసు): శెట్టిగుంటరోడ్డులోని వెంగమాంబ దేవస్థాన ప్రాంగణంలో మహిళలకు రంగవల్లుల పోటీలను సృజన సాహితీ, సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. అనంతరం వీరికి బహుమతులను అందజేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయురాలు పార్లపల్లి నాగేశ్వరమ్మ, మన హాస్పిటల్ అధినేత మారం సుధాకర్, రమేష్‌బాబు, ఆయుర్వేద వైద్యుడు శ్యామ్‌ధన్, హరిత రెసిడెన్సీ అధినేత్రి సుజాతరెడ్డి, సంస్థ అధ్యక్షుడు దగ్గుపాటి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.